పెద్దకథ, ఆఖరి భాగం

# ప్రత్యర్థులు



అల్లం రాజయ్య

గత సంచిక తరువాయి

ఆర్థిక సరళీకరణ మొదట తన కుటుంబంలో పాకింది- ఎవరూ దగ్గరికి రారు. రానియ్యరు. డబ్బు మనుషులు.

తన స్నేహితులు- ఆడ- మొగ- తనకు స్నేహితులున్నారా? తను గౌరవించాడా? ప్రేమించాడా? లేదు తనకు ప్రేమించడం తెలియదు. తను ఎప్పుడు ఎదుటివారిమీద ఆధిపత్యం సాధించాలనే తీవ్రమైన వాంఛతోటి- తనెప్పుడు మంది భుజా లెక్క తిరిగాడు. తనెవరిని నమ్మలేదు. తననెవరు నమ్మరు.

తన ఊరు. ఆ కొండలు- ఆ ఇల్లు-

ఒంటిలో ఏదో పాకింది. అదేమిటో తెలియదు.

తన ఊరికేం చేశాడు తను. పైగా తనెప్పుడు తన ఊరికి బద్ధశత్రువే.

వందమంది సాయుధ పోలీసులతో ఆ పాత ఇల్లు నిలబడ్డది తనలాగే.

ఈ గొడవలన్నీ ఒదిలిపెట్టి తన ఊళ్ళోకి పోతే- తను మళ్ళీ డాబామీద పడుకోగలడా?

పడుకున్నాడు... చుట్టూ తన కావలాగా నూరు మంది పోలీసులు.

పెద్దపెట్టున అలజడి- తుపాకుల మోత- మళ్ళీ నిశ్శబ్దం... అస్తుబిస్తుగా అడుగుల చప్పుడు. ఇంటి నిండా మురికిబట్టల జనం- ఆడవాళ్లు, మొగ వాళ్ళు, పిల్లలు, వృద్ధులు, చిత్రమైన కలయికతో-

పోలీసులందరిని ప్రహరీ గోడ వక్క నిలబెట్టి కొంతమంది సాయుధులు వాళ్ళ ఆయుధాలు గంజుకుంటున్నారు. ఇదేమిటి- కాల్పండి- అదు నాతన ఆయుధాలతో కాల్పండి. అందరిని.

తనను తన కొడుకును విడిచిపెట్టడానికి 'మెర్సీ పిటిషన్' మీద సంతకం పెట్టమని వచ్చిన వాని కొడుకే నాయకుడు. ఆ ముసలాడు కూడా- ఏదో చెప్పతున్నాడు.

కిటికీలు, దరువాజాలు, తలుపులు విరుగుతున్నాయి.

తననెవరో పట్టుకుని ఇంటి బయటకు ఈడ్చుకొస్తున్నారు.

వందలాది జనం- చుట్టుపక్కల ఊళ్ళ జనం... అందరు దూరం జరుగుతున్నారు.

"మన చుట్టుపక్కల పదూళ్ళ, మన ఊరివాళ్ళ రక్తమాంసాలు తిన్న ఈ భూతాల యిల్లును పేల్చేస్తున్నాం- దూరం జరగండి" ఆజానుబాహుడు- పెద్ద పెద్ద కళ్ళవాడు మైకులో హెచ్చరిస్తున్నాడు.

"వద్దు. వద్దు.. మీకేం కావాలన్నా ఇస్తాను"

"మీకు తీసుకోవడమే గాని ఇవ్వడం తెలియదు. మీకు చంపడమే గాని బతికించడం రాదు.. మీరు కోట్లు సంపాయించి- ఢిల్లీ గద్దెనెక్కి ఈ భూతాల గృహానికి కోట్లు ఖర్చుపెట్టి- మా వూరికి నీళ్ళు కాదు నిప్పులు తెచ్చినవ్- పోలీసు స్టేషన్ తెచ్చినవు" ఎవడో ముసలివాడు.

సాయుధులైన వాళ్ళు కొందరు తనను పట్టుకున్నారు.

ఇంటిలోపల ఏదో జరుగుతోంది. బిలబిల మంటూ మనుషులు బయటకు పరుగెత్తుకొచ్చారు. చింతచెట్ల కైనీడలో జనాన్నుద్దేశించి తన ప్రత్యర్థి చిత్రమైన గొంతుతో పెద్దగా మాట్లాడుతున్నాడు.

"తరతరాల నుండి ఈ కుటుంబం మన నెత్తురు పీల్చి బతికింది. చుక్క చెమట విడువకుండా పద మూడువందల ఎకరాల భూమి కబ్జా చేసుకున్నారు. వీళ్ల బీడు భూముల్లో మొలిచిన సీతపలుక్కాయలు కోసిండ్లని ఇదిగో అదే యింటిముందు వీపుల మీద బండలెత్తించిండ్లు! ఔనా?" తనకేసి చూసి అడిగాడు.

"ఔను. ఔను. గొర్రె మేకలు మేసినయని బందెల దొడ్లో వేసిండ్లు" ఎవరో?

"భూమికోసం వీళ్ళ దోపిడీ దౌర్జన్యాల నెదిరించి కమ్యూనిస్టు పార్టీ రైతాంగాన్ని, రైతుకూలీలను ఏకంచేస్తే పోలీసుల తెచ్చారు... కాల్పులు, అరెస్టులు.. చాలామంది ఊరిడ్చిపోవాల్సి వచ్చింది... వీళ్ల కుటుంబం పట్నం పారిపోయింది. ఇతను ప్రజావ్యతిరేకమైన కాంగ్రెసు పార్టీలో వాగవూర్ పోయి చేరిండు.. ఆ పోరాటం నెత్తురుటేర్లలో ముంచడంలో వీళ్ల పార్టీది ఘనమైన చరిత్రే- కొందరిని చంపి మిల్ట్రీ యాక్షన్ తెచ్చి- మళ్ళీ ఖద్దరు బట్టలతో ఊళ్ళుసొచ్చి- కమ్యూనిస్టులు పంచిన భూములు కబ్జా చేసుకున్నడు" ఇంకా ఏదో చెప్పతూనే వున్నాడు...

"ఎప్పుడు రిస్కు మందిది- ఫలితం నీది- ఊళ్లోని జనం సహకరించలేదు. మళ్ళా పెట్టిన వ్యవసాయం దెబ్బతిన్నది. ఊరుఊరంతా పోరాట ఫలితాల వట్ల మల్లగుల్లాలు పడ్డది. తన కులస్తులు ఎక్కువగా వున్న దగ్గర నిలబడి ఎమ్మెల్యే అయ్యిండు. మంత్రైయ్యిండు. తెలంగాణా, ఆంధ్రా గొడవల్లో ముఖ్యమంత్రి..."

"నా కాలంలోనే దేశంలో ఎక్కడ లేని భూసం

స్కరణలు తెచ్చినాను గదా" తనేనా...

"తెలంగాణా సాయుధ పోరాటంల వినోభావే భూదానం వొచ్చింది. శ్రీకాకుళంలో నువ్వు ఈ సంస్కరణలు తెచ్చినవ్. నక్కజిత్తులలోనివి- రాష్ట్ర వ్యాపితంగా పనికిరాని భూములు, తొండలు గుడ్లు పెట్టే భూములు భూసంస్కరణల పేర ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టాలని నీ ఎత్తు. అదీ పార లేదు. పాత పోరాటానుభవాలనుంచి సంఘాలు పుట్టినయ్. ఢిల్లీకి మారిండు.

అక్కడ దోపిడి దొంగలతో తోడై దేశాన్ని విదేశాలకు తాకట్టు పెట్టే పనిలో తలమునకలైనవ్- మనుషుల పట్ల- వాళ్లు చేసే పోరాటం పట్ల కసి పెంచుకున్నవ్. నువ్వే మంత్రిగ వున్నా దేశ వ్యాపితంగా- లేచిన పోరాటాలను అణచడంలో కీలక పాత్ర నీదే- నీ ఏజెంట్లు ఆంధ్రనంతా నెత్తురుమయం చేశారు.

ఇప్పుడు ఊరినిండా పోలీసులు- గాలింపులు, సోదాలు, ఎన్‌కౌంటర్లు- ఊళ్లనుంచి పదిమంది అజ్ఞాతంలోకి పోయిండ్లం- నీ భూముల మీద గొడవ నడుస్తూనే వున్నావు. నువ్వు ఈ ఊరి నెత్తురు చెమటతో పెరిగి పెద్దై, వేయి పడగల విషనాగై కష్టజీవులను కాటేస్తున్నావు. నీకు మరణశిక్షే-"

ఉలిక్కిపడ్డాడు. కలకాదు. కలవరింతే.. భ్రమలు...

కరీంనగర్ జిల్లాలో రాఘనేడు భూస్వామిని గుట్టలమీదికి తీసుకవెళ్లి కట్టెలు కొట్టించి మొక్కజొన్న కంకులు కాల్పించింది గుర్తుకొచ్చింది.

ఇక్కడే వుంటే గింటే- దేశం నిండా శత్రువులే.

పంజాబ్, కాశ్మీర్, నాగా మిజో, దండకారణ్యా పోరాటాలను అణచ ప్రయత్నించిందుకు మాటు వేసి చంపొచ్చు. ఆ పని తను చేయక తప్పదు. ఈ దేశంలోని పెట్టుబళ్ళు క్షేమంగా వుండాలంటే-

ఆర్థిక సరళీకరణ ప్రభావం తన కుటుంబంలోని మనుషులు డబ్బు మనుషులయ్యారు. తను బార్లా తెరచిన విదేశీ పెట్టుబడుల మూలకంగా గ్రామాలు వల్లకాళ్లవుతాయి. పరిశ్రమలు కుప్పకూలుతాయి. లక్షలాదిమంది నిరుద్యోగులై...

తను యుద్ధరంగాన్ని ఎప్పుడూ తప్పించుకోలేడు.. వెనక్కి తిరిగే చాన్సే లేదు. ఈ పాత్ర- తనలాగే ఉత్పత్తినుంచి, జీవితంనుంచి, శ్రమైక సమిష్టి జీవితంనుంచి గెంటివేయబడి- ప్రజలకు వ్యతిరేకంగా తర్ఫీదు చేయబడిన- అసాసినేషన్ పర్సనాలిటీస్- బ్యూరోక్రట్సు.. పారిశ్రామికాధిపతులు... భూస్వాములు పోలీసులు తప్పక నిలబడి కొట్లాడాల్సిందే.

నో... నో...

అతని కళ్లల్లో- అతి పురాతన చైనా రాజ సౌధం- చాంగైషేక్ వంటవాడు- కమ్యూనిస్టులు ముట్టడించారు... ఆ ముఖం తన ముఖం లానే వుందా? నైటుగౌనుతో రాజప్రాసాదం వెనుక గల మంచుకొండల మీదుగా ఉత్తకాళ్ళతో పరుగెత్తుతూ- తెల్లటి మంచుమీద మంచుకోసిన నెత్తురు పాదాలు...

అట్లా కాదు. కావడానికి వీల్లేదు.

కళవెళపడ్డాడు. గొంతు ఎవరో నొక్కినట్టు ఊపిరి బరువుగా- ఇక్కడే ఈ గెస్టవుజు చుట్టుముడితే- చిత్తూరులో ఇటీవలనే- ఇంతమంది సాయుధులు..

గదిలో వచారు....

మసక వెలుతురు గల చిన్న గదిలో మామూలు చెక్కబెంచీ మీద చైనా చివరి చక్రవర్తిని కూర్చుండబెట్టి కమ్యూనిస్టులు విచారించడం మనసులో మెదిలింది.

తన అతి సుదీర్ఘ రాజకీయ మిత్రున్ని కాల్చేసిన సంగతి గుర్తొచ్చి ఒళ్ళు గగుర్పొడిచింది.

తను ఈ సంకుల సమరంలో ప్రజావ్యతిరేకుల నాయకుడు కాదా? ఈశ్వర నరమేధంలో, మనుషుల వేటలో తను... ..

తను ఇక్కడకి వచ్చేముందటి రోజు పాల్గొన్న నాలుగు రాష్ట్రాల హోమ్ మినిస్టర్ల, ఐజీల మీటింగు గుర్తొచ్చింది. తనే చొరవ తీసుకుని ఏర్పాటుచేశాడు. తను ఆలిశ్యంగా వెళ్ళాడు కావాలని. బార్డర్ ఫోర్సును ఎక్కడెక్కడ ఎంత పెట్టాలో వాళ్లు నిర్ణయించారు. అంచనాలు, విశ్లేషణలు, నాలుగు రాష్ట్రాల అజ్ఞాత నాయకుని ఫోటో తనకు చూపించారు. అతని గురించి వాళ్లకు తెల్సింది చెప్పకొచ్చారు. తనకు ముందే తెలుసు- కాని చూడక ఎన్ని సంవత్సరాలో-

పెద్ద పెద్ద మీసాలు- నిర్లక్ష్యపు పెద్ద కళ్ళు- ఆనాడు అతని మెర్సీ పిటిషన్ మీద సంతకం పెడితే- తను ముఖ్యమంత్రి- పెటటొచ్చు. కాని పెట్టలేదు. పెట్టలేదు. క్షమించలేదు. తను నిరుపేదను- కల్మషం లేని కళ్ళను- మట్టినుంచి పుట్టి పెరిగిన మనిషిని క్షమించలేదు. ఆ మనిషే- తన రక్షణ గురించి- తన స్వేచ్ఛ గురించి తన దగ్గరికి వచ్చిన మనిషే- ఆ మనిషే ఇతడు కాగలడని- నాలుగు రాష్ట్రాల ఆదివాసుల ప్రియ తమ నాయకుడు కాగలడని తనకు తెలుసా? ఎట్లా సాధ్యమైంది? తను ఇక్కడిదాకా రాలేదా? ఒకే మట్టిలోంచి, ఒకే పరిసరాల్లోంచి ప్రత్యర్థులు పుట్టి పెరిగి పరిణతి చెంది.....

శకుంతల... ముప్పైయిదు సంవత్సరాల ప్రౌఢ అతనిముందు నిలిచింది. ఆమె దగ్గరకే పోతే- తనమీద తనకే అసహ్యం వేసింది. తనకు తెలుస్తూనే వుండేది. ఆమెకు అధికారం కావాలి.

ఎంత దారుణం. తనకు మనుషుల వేట కావాలి.

కాంతం తనే గొంతు పిసికి చంపుతుంది...

ఎవరు లేరా? తనకెవరు లేరా? ఈ దిక్కుమాలిన... ఇంత దూరం ఎగపోస్తూ ఎందుకు పరుగెత్తినట్టు?

ఏదో అర్థమై కానట్టే- ఆర్ద్రమై, బిగుసుకుపోయి... చిత్ర విచిత్రమైన- చెల్లా చెదరైన- అత్తరిబిత్తరైన, జ్ఞాపకాల ముద్రలు. ఆలోచనలతో- స్థితులతో-


ఎప్పుడు నిద్రలోకి జారుకున్నాడో?

* * *

అక్కడెక్కడో దూరంగా సుదూరంగా ఎం.ఎస్. సుబ్బలక్ష్మి గొంతు 'భజగోవిందం' అంటూ విన్పిస్తోంది. ఒక్కొక్కసారి మంద్రంగా...

కళ్ళు విప్పి చూశాడు.. .మూఢమతే- తనెక్కడున్నాడు? మార్పులేని నాలుగు గోడలు- పైన కప్పు- కాంతివిహీనంగా వెలిగే ట్యూబులైటు- విసీఆర్ ఆటోమాటిక్‌గా ఆగిపోయింది.

బయట పక్షులు గోలగోలగా అరుస్తున్నాయి.



ఒళ్ళంతా నొప్పిగా వుంది . అలసటగా వుంది. మంచుపర్వతాలు కరుగుతున్నట్టుగా... ఏమనాలో తెలియనట్టుగా- పాయలు పాయలుగా- వల యాలు వలయాలుగా- చిన్న దృశ్యం మనసై- పెద్దదైనట్టుగా- మెల్లిగా లేచాడు... మోకాళ్లు కిరుకిరులాడాయి. లేచి బయటకొచ్చాడు.

బయట దూరంగా భక్తుల కోలాహలం- కుడి వేపు కొండ దిగువ భాగం బంగారం పొడి చల్లినట్టుగా సూర్యరశ్మితో మెరుస్తోంది. పాము మెలికల్లా వున్న దారిగుండా వాహనాలు పైకి ఎగబాకుతున్నాయి. పతనమైన చంద్రగిరి కోట కావల ఊళ్లు దూరంగా....

బహుశా తనలాంటివాళ్లే ఇలాంటిచోట్లకు వస్తా రేమో! మళ్లీ పోతారు. వాళ్ళందరికీ ఇళ్ళున్నాయి. తను పోవడానికి జాగేది? చెట్టు కొమ్మనుండి విడివ డిన ఆకు- గాలికి తేళిపోతూ- కాదు. ఆ ఆకుకు రక్షణ. అది పోరాడు. తన యిష్టమొచ్చినట్టు ఎగురరాదు.

బయట సాయుధ గార్డు తిరుగుతున్నారు. కొంచెం ఎక్కువగా కన్పిస్తున్నారు. బయట రక్షణ వలయం. లోపల తనకు భయం తనను తాను రక్షించుకోలేడు. తన ప్రత్యర్థికి ఏ రక్షణ లేక బయట కనిపిస్తే కాల్చేస్తారు. లోపల లక్షలా దిమంది ఆదివాసులు... రక్షణ సిబ్బందే కదా చంపింది ఇదివరకటి నాయకులను.

కొండలమీదుగా చిత్రమైన వెలుగు- లోయల మీదుగా జారే వెలుగు...

అప్పటికే దూరంగా తనకోసం వచ్చిన రాజకీయ ప్రముఖులు- విలేకర్లు- ఫొటోగ్రాఫర్లు పికెటింగ్ దగ్గర ఆరాటపడుతున్నారు.

ఆవులించి గెస్ట్‌హౌస్ ముందు కాసేపు పచార్లు చేశాడు. మామూలుగానైతే ఉదయం వూట వాక్ మన్‌లో సంగీతం వింటూ నడుస్తాడు. ఇవాళ ఆ అలవాటు తప్పింది.

అంతా మరచిపోవాలి. పోవాలి ఎక్కడికి కిందికా? పైకా? మళ్ళీ రొటీన్ వార్తలు కావాలి...

వార్తాపత్రికలన్నీ తెచ్చిచ్చారు... తెరువబుద్ధి కాలేదు. ఊరకే పట్టుకున్నాడు. అన్ని పత్రికల్లో తన ఫొటో.. ఈ మధ్య టీవీకోసం అయ్యర్ పర్యవేక్షణలో తీయించిన ఫొటోలు.

పచారు చస్తూనే పత్రికలవాళ్లను పంపమని సైగచేశాడు.

అధికారులు పరుగెత్తుకొచ్చారు.

"సెక్యూరిటీ ప్రాబ్లమ్ సర్" అధికారి గొణిగాడు.

అతని ముఖంలోకి చూశాడు.

"హోం శాఖనుంచి మెసేజి వచ్చింది సర్- ఢిల్లీలో మీకోసం చాలామంది ఎదురుచూస్తున్నా రట- మీకోసం ప్రత్యేక విమానం రేణిగుంటలో వెయిట్ చేస్తున్నదట సర్"

అధికార్లు తలలు వంచుకున్నారు అయిష్టంగానే. బాంబేలో కుర్లాలు, పాయ్ మంతనాలడుతున్నా రేమో? ఢిల్లీలో.

"విలేకర్లను పంపండి" దూరంగా చూస్తూ కుర్చీలో కూర్చుంటూ.

అధికార్లు అందరినీ అనుమతియ్యలేదు. ఇద్దరు ఫొటోగ్రాఫర్లు- నలుగురు విలేకర్లు- అదే మధు రమైన కెమెరా చప్పుడు.

"కూర్చోండి యంగ్‌మెన్" అలవాటైన నవ్వుతో...

నవ్వులో జీవం లేదు. అలవాటైన కపటం కూడా లేదు.

విలేకర్లు కూర్చున్నారు. కొందరు ప్రశ్నలడిగారు. వాళ్లకు కావల్సింది- తను ఎప్పుడూ చెప్పంది. తనకాసక్తి లేదు...

కొంచెం మెల్లకన్ను- సన్నగా వున్న విలేకరి కొంటెతనపు గొంతుతో-

"మీ పాత ఇంటి రక్షణకు వందమంది సాయుధ పోలీసులను వుంచాలా వద్దా అని చర్చ జరుగు తోంది?"

"జౌనా!"

"ఇప్పటికే అయిదుకోట్లు ఖర్చయిందని- ప్రతిప క్షాలు"

"లెక్కలు పెట్టడంలో వాళ్లెప్పుడూ ముందే"

" ఆ పాత ఇంటికి అంత ఖర్చు పెట్టి- అంత మంది పోలీసులు ఆ వూరి ప్రజలను చిత్రహింస పెట్టడానికేనని, ఆ వూరి అభివృద్ధికి ఒక్క రూపాయి ఖర్చు పెట్టలేదని ఆ వూరి వాళ్లంటు న్నారు. మీరేమంటారు?"

> అందరికీ సమస్కరించి
> లోనికి నడిచాడతను
> తను విజేతా? పరాజితుడా?
> ఊళ్లోవాళ్లు విజేతలా?
> అతని మదిలో ప్రశ్నలు.

"దేశంలో ఎన్నివేల గ్రామాలున్నాయి. అన్ని గ్రామాల అభివృద్ధే మా ధ్యేయం"

"మీరు దేశానికి నాయకుడై పాలిస్తున్నా- మీ వూళ్ళో మాత్రం నక్సలైట్ల పరిపాలన సాగుతోం దని- మీ వూరినుంచే పదిమంది తీవ్రవాదులు అజ్ఞాతంలోకి పోయినట్టుగా..." ఇంకో విలేకరి.

ఆ విలేకరి ముఖం చూశాడు. వీళ్లకు అన్నీ తెలుసా? అటు నాయకుడు అక్కడినుంచే వొచ్చా డని వీళ్లకు తెలియనట్టున్నది.

"హింస ఎవరికైనా మంచిది కాదు. హింసతో ఏదీ సాధించలేం" బయటకు- ఇంతమంది సైన్యంతో దేశవ్యాపితంగా చెలరేగే కోపాన్ని, ఉద్యమాలను అణచడం- ఊచకోత- తప్పదు. పరిత్రాణాయ సాధూనాం... మంచిది కాదు మనుషులకు. కాని తనకది కావాలి.

"రాత్రి తెల్లవారుజామున రెండుగంటలకు మీ ఊరి సర్పంచ్ గంగారెడ్డిని ఇన్‌ఫార్మరని తీవ్రవాదులు కాల్చేశారు" మెల్లకన్ను విలేకరి కవ్వింపు గొంతుతో

అతని ముఖం మాడిపోయింది. ఎక్కడో కలుక్కుమన్నది.

అందరికి నమస్కరించి లోపలికి నడిచాడు.

తను విజేతా? ఊళ్ళోవాళ్లు విజేతలా? తను పరాజితుడా?

తను గుంజాటన పడ్డది- తను ఎటు పోవాలో తెలిసినట్టు- అన్నిటికి పరిష్కారం దొరికినట్టు కాళ్లె గరేసుకుంటూ గదిలోకి తన లోపలికి నడిచాడు.

తను ఓడినా గెలిచినా వెనక్కి పోలేదు? తన మాతృభూమి మీద పాదం మోపలేదు... దాన్ని కసితో రక్తసిక్తం చేసింది తనే- దాన్ని గాయపర్చింది తనే- ఆ మాతృభూమి నుంచి ఢిల్లీదాకా- ఢిల్లీలో దేశ విదేశాల క్రిములున్నాయి. ఇవి రక్తం పీల్చి ఉత్త మాంసం మాత్రమే వొదులుతాయి.

ఈ ఆటలో దళారీ- అతని ముఖం అంతకం తకు బిగుసుకుపోసాగింది-

తను యుద్ధరంగంలో నిలబడక తప్పదు. చిన్నా భిన్నమైన దేశంలో- విముక్తి కోరే ప్రజానీకంలో- తనలాంటివాళ్ల మూలకంగా నష్టపోయినవాళ్లు- రకరకాల ఏజెంట్లు- కోట్లకు పడగలెత్తిన నాగు బాముల పడగనీడల్లో- పడగల విన్యాసంలో- ఆడిస్తూ, ఆడుతూ తిరగాలి.

మరోపక్క సాయుధమౌతున్న ప్రజలు తన ప్రత్యర్థులు- మట్టిమనుషులు.

నెత్తురు పాదాల పాలిపోయిన షాంగై షేకు వొణుకుతూ జాతీయ ప్రభుత్వం తరఫున- ఐక్య సంఘటన కమ్యూనిస్టులతో బలవంతంగా సంతకం చేయడం కళ్ళల్లో మెదిలింది.

గది బయటికి రాలేదు.

అధికార్లు కాలుగాలిన పిల్లుల్లా తిరిగారు.

"రాత్రికి ఇక్కడ వుండ వీలుకాదట" సంటా యన.

"ఎక్కడా వుండ వీలుకాదు. అంతా రక్త సిక్తమే. ప్రతి అంగుళం యుద్ధరంగమే"

హెలికాప్టర్ రొద విన్పించింది.

సాయంత్రం నాలుగు గంటలకు ఎట్లా వచ్చిన వాడు అట్లాగే గది బయటకొచ్చాడు.

అతని ముఖంలో దిగులు లేదు. అట్లని సంతోషం లేదు. ముడుతలు పడిన ముఖం మరింత ముదు చుకపోయింది- ఏదో కుట్రకు సిద్ధపడుతున్నట్టుగా వుంది.

గుసగుస నడిచి హెలికాప్టరెక్కాడు.

కొండలమీదుగా హెలికాప్టర్ రొద పెడుతూ బయలుదేరింది.

— సమాప్తం